క్లుప్తంగా

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

మానవపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి లైట్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. రాత్రి, సమయల్లో విద్యుత్ లైటు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల భద్రత రీత్యా లైట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

బోరుకు మరమ్మతు చేయండి సారూ



మానవపాడు: మండలంలోని గోకులపాడు గ్రామంలో గత రెండు నెలలుగా బోరు చెడిపోయిందని దానికి మరమ్మతు చేయాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. వాడుకునేందుకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పశువుల దాహార్తి కోసం కాలువలు, వాగులు, వంకలకు వెళ్లి నీరు తెచుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చొరవ చూపి బోరుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పంచాక్షరి ఏకాహ భజన



మల్దకల్: మండలంలోని అమరవాయి వీరాభద్రేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం పంచాక్షరి ఏకాహం భజన కార్యక్రమాన్ని భజన మండలి సభ్యులు నిర్వహించారు. ఆదివారం ఉదయం 6గంటల నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు ఈ పంచాక్షరీ ఏకాహం భజన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాండురంగ స్వామి తెలిపారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో భజన మండలి సభ్యులు పంచాక్షరీ ఏకాహం భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, భజన మండలి సభ్యులు పాండురంగారెడ్డి, విక్రమ్‌సింహారెడ్డి, కృష్ణమూర్తి, వీరన్న, రమేష్‌రెడ్డి, వెంకట్రాములు,విజయ్, లక్ష్మీనారాయణ, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డికి ఘన నివాళి



అయిజ: బ్రిటీష్ దొరలను ఎదురించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలు ఆదివారం పట్టణంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధికార ప్రతినిధి గంగర్ల ఈశ్వర్ హాజరయ్యారు. నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం రాక ముందే బ్రిటీష్ దొరల దుష్ట పాలనను ఎదిరించి, తిరుగుబాటు చేసి, సమరశంఖం పూరించి, తెలుగువారి పౌరుషాన్ని చాటిచెప్పిన ఘనత ఉయ్యాలవాడ నరసింహారెడ్డికే దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలోఅలంపూర్ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు మధురవాణి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు భగత్ రెడ్డి, ప్రదీప్ కుమార్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి : కేసు నమోదు

గద్వాల క్రైం: ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి గద్వాలలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గద్వాల డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్ గద్వాల బస్టాండ్ నుంచి కర్నూలుకు ప్రయాణికులతో 8.30 గంటలకు బయలుదేరింది. అయితే కొందరు యువకులు మద్యం మత్తులో బైక్ నడుపుతూ బస్సును ఓవర్‌టెక్ చేసేందుకు వేగంగా వెళ్లారు. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ సైడ్ ఇవ్వడం లేదని ఆగ్రహించి అంబేద్కర్ చౌరస్తాలో బస్సు ముందు బైక్ అడ్డుగా నిలిపి ముగ్గురు యువకులు డ్రైవర్ రఫీపై దాడి చేశారు. ప్రయాణికులు యువకులను పట్టుకొని పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలవగా.. చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన యువకులు గద్వాలకు చెందిన హరి, సర్దార్, జ్ఞానేష్‌గా గుర్తించినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

- పైకప్పు పెచ్చులూడుతున్న వైనం
- గోడలు నెర్రెలుబారిన దుస్థితి
- భయాందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



శిథిలమైన ప్రాథమిక పాఠశాల భవనం

అయిజ: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. శిథిలమైన పాఠశాల భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నా సరే వాటిలోనే పాఠశాలలు నిర్వహిస్తున్న దుస్థితి నెలకొంది. మున్సిపాలిటీలోని గుంత రామలింగేశ్వర స్వామి ఆలయం పక్కన నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాల 85 సంవత్సరాల క్రితం నిర్మించారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. అయినా సరే అదే భవనంలో పాఠశాల నిర్వహించడం శోచనీయం.

భయాందోళనలో విద్యార్థులు...

శిథిల భవనంలో మొత్తం 6 తరగతులు నిర్వహిస్తున్నారు. మొత్తం నలుగురు టీచర్లు బోధిస్తుండగా 127 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులు, టీచర్లు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. అదే భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్నారు. ఊహా తెలియని చిన్నారులు కూడా అక్కడ ఉండాల్సి రావడంతో తల్లిదండ్రులు ఆందోళనకు చెందుతున్నారు.

భవనాన్ని ఖాళీ చేయాలంటున్న నిపుణులు

ఇంజినీరింగ్ నిపుణులు ఇటీవల పాఠశాల భవనాన్ని పరిశీలించి హెచ్చరికలు జారీ చేశారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలమై, కూలేందుకు సిద్ధంగా ఉందని వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. అయినా సరే అధికారులు పాఠశాలను ఖాళీ చేయించడం లేదు.

పట్టించుకోని అధికారులు...

ఇంజినీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు శిథిలమైన పాఠశాల భవనాన్ని ఖాళీ చేయించాలని అధికారులతో మొరపెట్టుకుంటున్నా సరే విద్యా శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ భవనం ఖాళీగా ఉండడంతో ఆ భవనంలోకి పాఠశాలను మార్చాలని, లేదా ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనంలోకి మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తరగతి గదిలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు

ప్రమాదం జరుగకముందే ఖాళీ చేయాలి..



ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైంది. పైకప్పు పెచ్చులూడి పడుతుంది. . ప్రమాదం జరుగక ముందే అధికారులు, ప్రజా ప్రతినిధులు మేల్కొని భవనాన్ని కూల్చి వేయాలి. లేదంటే విద్యార్థులను వేరే భవనంలోకి మార్చాలి.

– యువతేజశ్వర్ రెడ్డి, అయిజ

సురక్షితమైన భవనంలోకి మార్చాలి..



ప్రాథమిక పాఠశాల శిథిలమై ఏళ్లు గడుస్తుంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. వెంటనే పాఠశాలను సురక్షితమైన భవనంలోకి మార్చాలి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలి.

– నజీర్, అయిజ

ఉన్నతాధికారులకు తెలియజేశాం..



గత నెలలో మున్సిపల్ ఏఈతో కలిసి ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించాం. ఆర్‌అండ్‌బీ అధికారులు భవనాన్ని పరిశీలించి సౌండ్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంది. సర్టిఫికెట్ ఇచ్చిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు తెలిపారు.

– రాములు దయాల్, ఎంఈఓ

'సింహగర్జన' సభ విజయవంతం చేయాలి



మాల మహానాడు నాయకుల సమావేశం

అలంపూర్: మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలో అంబేద్కర్ భవన్‌లో మాల మహానాడు సంఘం అధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాల మహానాడు సంఘం నాయకులు మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలకు ఉన్న రాజ్యాంగ హక్కులు, విలువల మూలాలు దెబ్బతీసే విధంగా ప్రవహరిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రశ్నించేందుకు, దళితుల ఐక్యతను కాపాడేందుకు మాల మహనాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ రావు 1000 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. పాదయాత్ర డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్ చేరుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగాసికింద్రబాద్‌లో మాల సింహగర్జన సభ నిర్వహిస్తారని భారీ బహిరంగ సభకు ప్రతి గ్రామంలోని మాలలు, మాల ఉపకులాలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగరాజు, బలగం నాగరాజు, తుమ్మల రవికుమార్, రజనిబాబు, విజయ్, పరుశురాముడు, బుచ్చన్న, మునిస్వామి, ఆనంద్, చైతన్య యువజన సంఘం నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కురవ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

గద్వాల అర్బన్: జిల్లా కురువ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సంఘ రాష్ట్ర సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రాజశేఖర్‌లతో పాటు సభ్యుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎల్లప్ప, జిల్లా అధ్యక్షుడు జమ్మిచేడు సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కరాటే శ్రీహరి, ఉపాధ్యాక్షులుగా పెద్దోడి రామకృష్ణ, మనోజ్, గోవర్ధన్, కుర్వ పల్లయ్య, కార్యదర్శులు ఈరన్న, లవన్న, ఈశ్వర్, దౌలన్న, కోశాధికారి కేశవులు, చంద్రన్నతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. అదే విధంగా మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ నళినిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐక్యమత్యంగా ఉండి హక్కుల సాధనకు నిరంతరం పోరాడుదామన్నారు. అందరి తోడ్పాటుతో కురువల అభ్యున్నతికి పాటుపడుతామన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో కురువ ఉద్యోగుల సంఘం సభ్యులు వెంకటేష్, నాగరాజు, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, ఆయా మండలాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

మీ సేవ నూతన కార్యవర్గం ఎన్నిక..

గద్వాల: మీ సేవ ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక బాలభవన్‌లో ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా మీసేవ రాష్ట్ర అధ్యక్షుడు బైరా శంకర్ హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా గఫూర్ ఎన్నికైనట్లు సభ్యులు తెలిపారు. . కార్యక్రమంలో మీసేవ సెంటర్ల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులకు మరమ్మతు చేయాలి



సాసనూలు దగ్గర మరమ్మతులకు నోచుకోని కల్వర్టు

ఎర్రవల్లి: మండల పరిధిలోని ఆర్‌అండ్‌బీ రహదారులపై గతంలో నిర్మించిన కల్వర్టులు వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో మండల కేంద్రం నుంచి రాజశ్రీ గార్లపాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై కల్వర్టులు అధ్వానంగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు భయాందోళనలో ఉన్నారు. ప్రతి రోజు రద్దీగా వాహనాలు వెళ్తుండటంతో కల్వర్టుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ఆర్. గార్లపాడు, సాసనూలు, షేకుపల్లి, గ్రామాల సమీపంలోని కల్వర్టులు కూలిపోయిన ప్రదేశంలో కూడా ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టులకు వెంటనే మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

హిందూ చైతన్య రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

అయిజ: ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో హిందూ చైతన్య రథయాత్ర నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందు చైతన్య రథయాత్ర రాష్ట్రీయ స్వయంసేవక్ పాలమూరు విభాగ ప్రచారక్ దేవేందర్, విభాగ ధర్మ జాగరణ ప్రముఖ్ లక్ష్మికాంత్ ఆధ్వర్యంలో ఈ నెల 11 తేదీన మద్దూరు మండలంలో ప్రారంభమైన యాత్ర అయిజ మండలంలో కొనసాగుతుందని తెలిపారు. అచ్చంపేటలో మద్దిమడుగు ఆంజనేయ స్వామి దేవాలయం వద్దకు చేరుకుని ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రముఖ్ తిమ్మప్ప, బీజేపీ నాయకులు కంపాటి భగత్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, లక్ష్మణాచారి, చిన్ని కృష్ణ, కృష్ణయ్య, రఘుపతి, సుభాష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముండ్లదిన్నెలో తాగునీటి ఇక్కట్లు



రాజోళి: మండలంలోని ముండ్లదిన్నె గ్రామంలో ప్రజలకు తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో గ్రామంలో ఉన్న మోటర్లతో ట్యాంకులకు నీరు నింపి వాడుకుంటున్నట్లు తెలిపారు. గత 15 రోజులుగా మోటార్లు కూడా పని చేయక పోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మోటార్లు మరమ్మత్తులు చేసి ట్యాంకుల ద్వారా నీటిని అందించాలని కోరుతున్నారు.

మండల బూత్ కమిటీ సమావేశం



సాతర్లలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుగౌడ్

ఇటిక్యాల: మండల పరిదిలోని సాతర్ల గ్రామంలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా ఆద్వర్యంలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య ఆతిథిగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుగౌడ్ హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా జరిగిన మెంబర్‌షిప్ డ్రైవ్‌లో చురుకుగా పాల్గొన్న కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయా బూత్‌లలో అధ్యక్షులుగా 13 మందిని ఏకగ్రీవంగా నియమించి బూత్ కమిటీలు ఏర్పాటు చేశారు. మండలంలో పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ట్రెజరర్ నాగముని, బూత్ అధ్యక్షులు మహేంద్ర, వీరన్న, రాజగౌడ్, సిద్దుగౌడ్, గోవిందు, మహేష్, ఈదన్న, నరేష్, విష్ణు, కృష్ణ, బొజ్జన్న, షాలు, సత్యగౌడ్, కృష్ణకుమార్, మద్దిలేటి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సందెరాళ్ల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గట్టు: మండల కేంద్రంలో భవానీమాత జాతర సందర్భంగా ఆదివారం సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. పోటీలు తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోటీల్లో నాగర్‌దొడ్డి ప్రతాప్ మొదటి బహుమతి, ద్వితీయ బహుమతిని కున్సి నర్సింహులు, తృతీయ బహుమతిని గుడెబ్లూరుకు చెందిన సూరి గెలుచుకున్నారు. విజేతలకు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకుడు రామకృష్ణారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దాతలు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, బోల్‌రెడ్డి, అలుబెంచి రాజప్ప జీ.కృష్ణ రాజప్ప, సంతోష్, కృష్ణ,బజారి, సుదర్శన్‌రెడ్డి, రంగస్వామి, ఈరన్న, నవీన్ చారి, కిట్టు, మధుచారి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు భక్తితో పూజలు



శాంతినగర్: కార్తీకమాసం పర్వదినాల్లో గో ప్రచారక్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం గోమాతకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడు మిట్టల్లోని శ్రీ సద్గురు ఆది నారాయణస్వామి వారి ఆశ్రమంలో వెలసిన జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ధరూరు: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్సై షకూర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని పలువురికి జరిమానా విధించారు. పెండింగ్ చలానాలు క్లియర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదు పరిశీలన

ఇటిక్యాల: మండల కేంద్రంతో పాటు శివనంపల్లి, ఎం.ఆర్ చెర్వు, మునుగాల గ్రామాల్లో ఆదివారం కొనసాగిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆర్‌ఐలు భీమ్‌సేన్‌రావు, మధు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారం-6 ద్వారా ఓటర్ నమోదు, ఫారం-7 ద్వారా అభ్యంతరాలు, ఫారం – 8 ద్వారా అడ్రస్ మార్పుల గురించి వివరించారు. నమోదు వివరాలను బీఎల్వోల వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామాల బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి లక్ష బిల్వార్చన

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం గ్రామంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక శనివారం సందర్భంగా లక్ష బిల్వార్చన పూజలు చేశారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ అర్చకుల మహాసభ

అయిజ: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ధూపదీప నైవేద్య అర్చకుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి మాట్లాడుతూ.. అన్ని ఆలయాల్లో దేవతా మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించాలని సూచించారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు పోరాడాలని కోరారు. అశోక్, శేఖరయ్య, రఘుశర్మ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



అయిజ: పంట పొలాల్లో ఆవుల మందలు తిరుగుతూ పంటలు నాశనం చేస్తుండడంతో ఆదివారం రైతు సంఘం నాయకులు పంట పొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి మాట్లాడుతూ..పశువులను యజమానులు ఇళ్ల వద్ద పశువులు కట్టివేయాలన్నారు. పొలాలు నాశనం చేసే ఆవులను వేలం వేసి విక్రయించాలని రైతు సంఘం తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల బి. విష్ణురాజు - 9666283739
అలంపూర్/అయిజ ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి